

రాములోరి భూములు స్వాహా!

సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో 300 ఏళ్లనాటి కోదండరామస్వామి ఆలయ భూములను ఓ వ్యక్తి స్వాహా చేశాడు.

- 8లో..



అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ సోమవారం తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

22న జాబ్‌మేళా

ఒంగోలు అర్బన్‌: జిల్లా ఉపాధి కార్యాలయం (ఎంప్లాయిమెంట్‌ ఆఫీస్‌)లో ఈ నెల 22వ తేదీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి భరద్వాజ్‌ ఒక ప్రటనలో తెలిపారు. దీనిలో అరబిందో ఫార్మా లిమిటెడ్‌, నవయుగ డెవలపర్స్‌, జోయాలుక్కాస్‌ సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ట్రైనీ ఆపరేటర్స్‌, మార్కెటింగ్‌, సేల్స్‌ తదితర అంశాల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్‌ కార్యాలయానికి సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

● కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

మద్దిపూడి(కొండపి): స్థానికంగా ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. సోమవారం కొండపిలోని సీతారామ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి స్పందన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి 300 దరఖాస్తులు అందజేశారు. అనంతరం కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌ మాట్లాడుతూ అధికార యంత్రాంగమే ప్రజలకు చేరువయ్యేలా నియోజకవర్గ స్థాయిలో స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాత్కాలిక పనులు చేయడం కాకుండా వందశాతం సమస్యలను పరిష్కరించి అర్జీదారులు సంతోషించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, పరిష్కరించని పక్షంలో అందుకు కారణాలు కూడా అర్జీదారులకు వివరించాలని సూచించారు.

కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ కే శ్రీనివాసులు, కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్‌, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌, కొండపి నియోజకవర్గ ప్రత్యేకాధికారి నారదముని, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగమేశ్వరం.. డోలాయమానం..!

మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో నాడు మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి పాలేరుపై సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మించాలని తలంచారు. సాగు, తాగునీరు పుష్కలంగా అందించాలన్న ఉన్నత ఆశయానికి టీడీపీ గండికొట్టింది. ప్రాజెక్టుకు అడుగులు పడి పదిహేడేళ్లు గడిచినా మోక్షం కలగలేదు. ఇందుకు ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి వ్యవహారశైలే కారణమని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకూ ఇద్దరు కాంట్రాక్టర్లు సైతం తాము పనులు చేయలేమని చేతులెత్తేశారు. టీడీపీ నేతలు చేసిన పాపం నేడు నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారింది.

- పాలేరు ప్రాజెక్టుకు ఎమ్మెల్యే డోలా గ్రహణం
- కొండపి ఎమ్మెల్యే తీరుతో అడుగు కూడా ముందుకు పడని వైనం
- ఎమ్మెల్యే వైఖరితో అన్నదాతలకు, ప్రజలకు తప్పని తిప్పలు
- కమీషన్ల గోలతో తప్పుకున్న ఇద్దరు కాంట్రాక్టర్లు
- అధికారంలో ఉన్న ఐదేళ్లూ పట్టించుకోని చంద్రబాబు
- యువగళం పేరుతో మండలానికి లోకేష్‌ రాక
- నాడు గాలికొదిలేసిన నేతలు నేడు ఎవరి కోసం పాదయాత్ర అంటూ ప్రజల ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కొండపి నియోజకవర్గ ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు పొన్నలూరు మండలం సంగమేశ్వరం వద్ద పాలేరుపై రిజర్వాయర్‌ను నిర్మించాలని దివంగత మహానేత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి తలంచారు. జలయజ్ఞంలో భాగంగా 2006లో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. రూ.50.50 కోట్ల వ్యయ అంచనాలతో ప్రాజెక్టు నిర్మించాలన్న ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల పరిధిలోని దాదాపు 30 వేల మంది ప్రజలకు తాగునీరు అందించేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2009లో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి కె.రోశయ్య, ఇరిగేషన్‌ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో మాత్రమే రూ.15.07 కోట్లు వెచ్చించి కొంతమేర ప్రాజెక్టు పనులు, ప్రాజెక్టుకు కావాల్సిన భూముల కొనుగోలు లాంటివి జరిగాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర రెడ్డి అకాల మరణం తర్వాత పనులు ముందుకు సాగలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ పాలనలో సైతం ఒక్క అడుగు ముందుకు సాగలేదు.



శంకుస్థాపన శిలాఫలకం

టీడీపీ ఎమ్మెల్యే డోలా తీరే శాపంగా మారి:

కొండపి ఎమ్మెల్యేగా డోలా బాలవీరాంజనేయ స్వామి 2014లో మొదటిసారిగా గెలుపొందారు. నియోజకవర్గ ప్రజలకు గుండెకాయ వంటి సంగమేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఆయన వ్యవహరించిన తీరే శాపంగా మారిందన్న విమర్శలున్నాయి. కోట్ల రూపాయల ప్రాజెక్టు కావటంతో కమీషన్ల కోసం అటు అధికారులను, ఇటు కాంట్రాక్టర్లపై వేధింపులు ప్రారంభమయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మొదట టెండర్‌ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్‌ ఈ విధంగా అయితే పనులు చేయటం కష్టమని చేతులెత్తేశాడు. చివరకు అతను కట్టిన డిపాజిట్లు కూడా వదిలేసుకొని కాంట్రాక్టు నుంచి తప్పుకున్నాడు. ఆ తరువాత మరో కాంట్రాక్టర్‌ వచ్చాడు. అయనదీ అదే తీరు. మొదటిసారి ఎమ్మెల్యేగా పదవిలో ఉన్న డోలా బాల వీరాంజనేయ స్వామి హయాంలోనే ఇద్దరు కాంట్రాక్టర్లను మార్చారు.

2017 సెప్టెంబర్‌లో ఒకరు అగ్రిమెంట్‌ చేయగా, 2018 జూలైలో రెండో కాంట్రాక్టర్‌ అగ్రిమెంట్‌ చేశాడు. అయినా ప్రాజెక్టు పనులు మాత్రం పడకేశాయే తప్ప ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదు. ప్రాజెక్టు పూర్తి చేద్దామన్న కనీస ఆలోచన కూడా ఎమ్మెల్యే డోలా చేయలేదన్న విమర్శలొచ్చినా వాటన్నింటినీ పెడచెవిన పెట్టాడే కానీ ప్రాజెక్టును పూర్తి చేద్దామన్న ధ్యాసే అతనికి లేదన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా తాము చేసిన పాపాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తోసే ప్రయత్నం చేశారు టీడీపీ ఎమ్మెల్యేలు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ కమీషన్ల కోసం ప్రాజెక్టు పనులు ముందుకు సాగనీయకుండా చేసి నేడు పనులు చేపట్టాలంటూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యేలు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. అందులో స్థానిక ఎమ్మెల్యే డోలా ఉండడం గమనార్హం. అసలు ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారో ఎమ్మెల్యే స్వామి సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉండి చంద్రబాబు తర్వాత అన్నీ తానై వ్యవహరించిన నారాలోకేష్‌ సైతం దీనికి సమాధానం చెప్పాలని, నాడు తమ సమస్యలను పట్టించుకోకుండా నేడు యువగళం పేరుతో మండలానికి వచ్చిన ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **దోచుకోవడమే ఎమ్మెల్యే డోలాకు ఇష్టం**
>
> ప్రజల సొమ్మును దోచుకోవడమే ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామికి మరింత ఇష్టం. సంగమేశ్వరం ప్రాజెక్టు విషయంలో పర్సంటేజీల కోసమే ప్రాజెక్టును నిలువునా నాశనం చేశాడు. అతని ధన దాహం కోసం ప్రాజెక్టు నిర్మాణం కోసం వచ్చి కాంట్రాక్టర్లను బెదిరించి మరీ పనులు చేయనీయకుండా అడ్డుపడ్డాడు. దీంతో కాంట్రాక్టర్లు పనులు చేయకుండా వెళ్లిపోయారు. దీంతో సంగమేశ్వరం ఆగిపోయింది. సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నాలుగు మండలాల ప్రజలకు సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే ఈ ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి అంగీకారం తెలిపారు. నూతన అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం.
>
> **– వరికూటి అశోక్‌ బాబు, వైఎస్‌ఆర్‌ సీపీ కొండపి ఇన్‌చార్జ్‌**

రూ.207 కోట్లతో నూతన అంచనాలు



ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రతిపాదించిన ప్రదేశం

వైఎస్సార్‌ మరణం తర్వాత పాలకులు వ్యవహరించిన తీరు ప్రాజెక్టు పాలిట శాపంగా మారింది. పనులు తీవ్ర జాప్యం కావడంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం పెరిగిన ధరలను ఆధారం చేసుకొని సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే మొత్తం రూ.207 కోట్లు అవసరమని అంచనాలు వేశారు. స్పిల్‌వే, రేడియల్‌ గేట్లు, లో లెవల్‌ స్పిల్‌వే నిర్మాణానికి రూ.67.78 కోట్లు కావాల్సి వస్తుందని అంచనాలు రూపొందించారు. అదేవిధంగా ప్రాజెక్టు అంతరభాగంలో వస్తున్న పర్సూరివారిపాలెం గుడిపాడుకు వెళ్లే తారు రోడ్డు పునఃనిర్మాణానికి రూ.18.47 కోట్లు, కుడి, ఎడమల స్లూయిస్‌ల నిర్మాణానికి రూ.1.83 కోట్లు, సాగు నీరందించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలో భాగంగా కుడి, ఎడమ కాలువల నిర్మాణాలకు రూ.9.98 కోట్లు, ప్రధాన ఎడమ కాలువ నిర్మాణానికి రూ.7.02 కోట్లు, ప్రధాన కుడి కాలువ నిర్మాణానికి రూ.6.73 కోట్లు, మాకేరు గ్యాప్‌ పూడ్చేందుకు, ఇతర ఎర్త్‌ డ్యాం నిర్మాణానికి రూ.19.82 కోట్లు, చివరి భూములకు నీరందించేందుకు కాలువల నిర్మాణానికి రూ.1.49 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపారు. ఇవి మొత్తం కలిపి రూ.133 కోట్లు కాగా మిగతా రూ.74 కోట్లు విద్యుత్‌ లైన్లు, ప్రాజెక్టు విద్యుదీకరణ, గేట్లు, పరీక్షలు, భవనాల నిర్మాణం, నిర్వహణ, ప్రాజెక్టు రక్షణ, మిగిలిపోయిన భూముల కొనుగోళ్లు, పునరావాసం కోసం వెచ్చించాల్సి ఉందని అందులో పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన

● మంత్రి ఆదిమూలపు సురేష్‌



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్‌

పెద్దదోర్నాల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనను అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని యడవల్లిలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ మండల పార్టీ కన్వీనర్‌ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్‌ మాట్లాడుతూ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి కావడం వలన కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన ఈ నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. తాను ముఖ్యమంత్రిగా గెలవలేనని, సంఖ్యా బలంలేదని, నేను అసెంబ్లీలో ఎంటర్‌ అయితే చాలని, అంతకంటే ఎక్కువ అవసరం లేదని చెప్పిన్న పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఏ విధంగా నమ్ముతారని ప్రశ్నించారు. సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా భావించి జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా పాలన సజావుగా ముందుకు తీసుకెళ్లగలిగారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్‌ పనులను వేగవంతం చేసి మొదటి టన్నెల్‌ పూర్తి చేశారన్నారు. రెండో టన్నెల్‌ పనులు సైతం మరికొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పరిపాలనలో సమూలంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలో ఆదర్శంగా నిలిచారని అన్నారు. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసిన జగనన్న వాటి పరిష్కారానికి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి మెరుగైన సేవలందిస్తున్నారని వివరించారు. ముఖ్యమంత్రి వైయస్‌.జగన్‌ మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను మంత్రి సురేష్‌ వివరించారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌.విజయ, మైనారిటీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌ అబ్దుల్‌ మజీద్‌, దూదేకుల కార్పొరేషన్‌ డైరక్టర్‌ దూదేకుల ఖాసింపీరా, మండల పరిషత్‌ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, మండల నాయకులు గంటా గురవారెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, పొందుగుల మల్లారెడ్డి, యక్కంటి శ్రీకాంత్‌రెడ్డి, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, వెన్నా పాండురంగారెడ్డి, అలుగుల లక్ష్మయ్య, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్‌, కొంగరి వెంకట్రామయ్య, దూదేకుల రసూల్‌, యక్కంటి మల్లారెడ్డి, రమణయ్యతో పాటు మండల అధికారులు, ప్రజాప్రతిదులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి మేరుగు నాగార్జున



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపూడి(కొండపి): గ్రామ స్థాయిలో ఉన్న ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. కొండపిలోని సీతారామ కళ్యాణ మండలంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని, 11 రకాల అంశాలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అందేందుకు అధికారులు కృషి చేయడం అభినందనీయమన్నారు. రామతీర్థం జలాశయం నుంచి చీమకుర్తి, మద్దిపూడి, కనిగిరి, సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల తదితర గ్రామాల ప్రజల దాహార్తి తీరుస్తారన్నారు. పొదిలి చిన చెరువు నుంచి పైపులైన్‌ ద్వారా మద్దిపూడి మండలంలోని గుండ్లసముద్రం చెరువు, మద్దిపూడి చెరువులకు తాగు, సాగునీరు అందించేందుకు రూ.28.5 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంగమేశ్వరం ప్రాజెక్ట్‌ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు నూతన శోభ సంతరించుకున్నాయని విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామాల్లో ఏ ఒక్కరూ డ్రాప్‌అవుట్‌ ఉండరాదన్నారు. నియోజకవర్గంలో అంగన్‌వాడీ పాఠశాల భవనాలు నిర్మించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో దళితుల ఇళ్లపై నుంచి హైటెంక్షన్‌ వైర్లు వెళుతున్నాయని, వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ రహదారుల ఏర్పాటు, గ్రామాల్లో సైడ్‌ కాలువల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ వరికూటి అశోక్‌బాబు, కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ దృష్టి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జేసీ శ్రీనివాసులు, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్‌, ఆర్‌ఐఓ నారదముని, సివిల్‌ సప్లై డీఎం శ్రీనివాసులు, అన్నిశాఖల జిల్లా అధికారులు, 6 మండలాల తహశీల్దార్లు ఉన్నారు.

సాగర్‌ కుడికాలువకు నీరివ్వండి

- పూర్తిగా అడుగంటిన ఎస్‌ఎస్‌ ట్యాంకులు
- జిల్లాలో 6.50 లక్షల మంది నీటి కోసం అలమటించాల్సిన పరిస్థితి
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించిన మంత్రి ఆదిమూలపు సురేష్‌

యర్రగొండపాలెం:

ప్రకాశం జిల్లాలోని ప్రజల తాగు నీటి అవసరాల కోసం సమ్మర్‌ స్టోరేజి ట్యాంకులు నింపేందుకు సాగర్‌ కుడికాలువకు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేష్‌ సీఎంను కలిసి జిల్లాలో ఎదుర్కొంటున్న తాగునీటి పరిస్థితి గురించి వివరించారు. రామతీర్థం బ్యాలెన్స్‌ రిజర్వాయర్‌ పైఎత్తున ఉన్న 10 సీపీడబ్ల్యూఎస్‌ స్కీంలు పూర్తిగా అడుగంటాయని (డెడ్‌ స్టోరేజ్‌), దీనివలన జిల్లాలో 6.50 లక్షల మంది ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.

మే నెలలో వదలాల్సిన నీరు ఇప్పటి వరకు వదలకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని, వెంటనే సాగర్‌ కుడికాలువకు 5 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సీఎంను కోరారు. లేకుంటే జిల్లాలోని పుల్లలచెరువు మండలంలోని ముటుకుల, త్రిపురాంతకం మండలంలోని గొల్లపల్లి, దూపాడు, యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి, దొనకొండ మండలంలోని చందవరం, కురిచేడు, ముండ్లమూరు ఎస్‌ఎస్‌ ట్యాంకులను నీటితో నింపితే నీటి ఎద్దడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి తాగు నీటి సమస్యను పరిష్కరించవచ్చని వివరించారు. స్పందించిన సీఎం జగన్‌ మోహన్‌రెడ్డి నీటి విడుదలపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ నెల 19న జరిగే కృష్ణా రివర్‌ వాటర్‌ మానేజ్‌మెంట్‌ బోర్డు సమావేశంలో ఈఎన్సీలు, ఇంజినీరింగ్‌ అధికారులు నీటివిడుదలపై నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

నామమాత్రంగా యువగళం

- ఆద్యంతం నిరాశాజనకంగా సాగిన లోకేష్‌ పాదయాత్ర
- లోకేష్‌ సిబ్బంది, పోలీసులు తప్పితే పెద్దగా కనిపించని కార్యకర్తలు
- పాదయాత్రలో కనిపించని పోతుల రామారావు, బెల్లం జయంత్‌బాబు
- బహిర్గతమైన అంతర్గత కుమ్ములాటలు



పాదయాత్రగా వస్తున్న లోకేష్‌



పాదయాత్రలో లోకేష్‌తో ఏం మాట్లాడాలో శిక్షణ ఇస్తున్న వ్యక్తిగత సిబ్బంది

పొన్నలూరు: జిల్లాలోకి ప్రవేశించిన టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ యువగళం పాదయాత్ర సోమవారం కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం చెంచుపాలెం శివారు నుంచి ప్రారంభమైంది. అయితే మొదట లోకేష్‌ విత్‌ సెల్ఫీలతో హడావిడి చేసిన తెలుగు తమ్ముళ్లు పాదయాత్రలో చివరి వరకు కనిపించకపోవటం గమనార్హం. సుమారుగా వెయ్యి మంది కార్యకర్తలతో ప్రారంభమైన లోకేష్‌ పాదయాత్ర చివరికి 500 మందితో ముగించారు. వారిలోనూ లోకేష్‌ వ్యక్తిగత సిబ్బంది, పోలీసులే ఉన్నారు. ప్రతి రోజు వేల సంఖ్యలో జనాలు వస్తున్నారు, మహిళలు బారులు తీరి ఆశీర్వదిస్తున్నారంటూ పచ్చమీడియా హోరెత్తిస్తుండగా.. నియోజకవర్గంలో నామమాత్రంగా కూడా కార్యకర్తల సందడి కనిపించలేదు. యువగళం పాదయాత్ర ఆద్యంతం సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండు మేళాలు, సెల్ఫీలు తప్పా ప్రజలకు ఉపయోగపడే సరైన హామీలిచ్చిన దాఖలాలు లేవు. లోకేష్‌ పాదయాత్ర వెళ్లే మార్గంలో ముందుగానే ఆయన వ్యక్తిగత టీం సభ్యులు మహిళలకు ఏం మాట్లాడాలో శిక్షణ ఇస్తున్నారు. పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన పాడి రైతు సదస్సుకు కూడా ముందుగా ఎంపిక చేసిన తెలుగు తమ్ముళ్లను సదస్సులో కూర్చోబెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రశ్నలు అడిగించారు. కొంత మంది కార్యకర్తలు ఆ సదస్సులో పాల్గొందామని ఉత్సాహం చూపినా లోకేష్‌ వెంట వచ్చిన వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సదస్సుకు కొంత మంది తెలుగు తమ్ముళ్లకు ఆహ్వానం ఉన్నా వారిని వ్యక్తిగత సిబ్బంది సదస్సుకు రాకుండా అడ్డుకోవటంతో నాయకుల వద్ద వారు తమ అసహనం వ్యక్తం చేసి పాదయాత్రలో కొనసాగకుండా వెనక్కి వెళ్లిపోయారు. పాదయాత్ర మాలపాడు, తిమ్మపాలెం, అంకిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా సాగినా స్థానిక ప్రజలు ఎవరూ పట్టించుకోకపోవటం గమనార్హం.

పాదయాత్రలో కనిపించని పోతుల, బెల్లం వర్గీయులు:

కొండపి నియోజకవర్గంలోకి ప్రవేశించిన నారా లోకేష్‌ పాదయాత్రలో పార్టీ సీనియర్‌ నాయకులు పోతుల రామారావు, బెల్లం జయంత్‌ బాబుతో పాటు వారి వర్గీయులు కనిపించలేదు. కొంతకాలంగా పోతుల రామారావు, బెల్లం జయంత్‌ బాబుకు, ఎమ్మెల్యే డోలా, దామచర్ల సత్యకు మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కందుకూరు నియోజకవర్గంలో పాల్గొన్న పోతుల రామారావు, సొంత నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రలో కనిపించకపోవటంతో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య ఉన్న అంతర్గత కుమ్ములాట మరోసారి బహిర్గతమైనట్లయింది. అనుకున్న సంఖ్యలో పాదయాత్రలో తెలుగు తమ్ముళ్లు పాల్గొనకపోవటంతో లోకేష్‌ సైతం అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు సీతారాంపురం బాలికలు



పోటీలకు ఎంపికైన బాలికలు

హనుమంతునిపాడు: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 16వ తేదీన విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపాల్ స్టేడియంలో నిర్వహించిన త్రోబాల్ సెలక్షన్‌లో పొదిలి వెంకట కావ్య, జల్ది లాస్య ప్రియ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల పీడీ షేక్ జిలానీ బాషా సోమవారం తెలిపారు. వీరు ఆగస్టు 5, 6వ తేదీల్లో పాండిచ్చేరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను హెచ్‌ఎం కె.పద్మావతి, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రిప్ పైపులు చోరీ



పొలంలో రైతు శివారెడ్డి

తర్లుపాడు: పొలంలో ఉంచిన డ్రిప్ పైపులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తర్లుపాడుకు చెందిన లింగారెడ్డి శివారెడ్డి అనే రైతు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలాన్ని దున్నే క్రమంలో డ్రిప్ పైపులను కట్టగా చుట్టి ఒక చోట ఉంచానని, సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా రూ.80 వేల విలువైన డ్రిప్ పైపులు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభ దశలో డ్రిప్ పైపులు చోరీ కావడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రాములోరి భూములు స్వాహా!

- సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో టీడీపీ నాయకుని అవినీతి లీలలు
- 300 ఏళ్ల నాటి దేవస్థానం పరిధిలో 38.71 ఎకరాల భూములపై కన్ను
- వంశపారంపర్య ధర్మకర్త పేరుతో ఇప్పటికే 17.15 ఎకరాల రికార్డులు తారుమారు
- నేటికీ టీడీపీ నాయకుని కబంద హస్తాల్లో దేవాలయం
- ఈఓను నియమించాలని హైకోర్టు ఆదేశించినా చోద్యం చూస్తున్న దేవదాయశాఖ అధికారులు

సింగరాయకొండ:

దేవుడి ఆస్తులను కాపాడాల్సిన వ్యక్తే వాటిపై కన్నేసి అప్పనంగా దిగమించేస్తున్నాడు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తననెవరూ చూడటం లేదన్న చందంగా.. రూ.కోట్ల విలువైన భూములను కాజేస్తున్న ఆ వ్యక్తి పైకి మాత్రం పెద్ద మనిషిలా చలామణి అవుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెంలో 300 ఏళ్లనాటి కోదండరామస్వామి ఆలయం ఉంది. 1999వ సంవత్సరంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా టీడీపీ మద్దతుదారుడు అచ్చికాల వెంకట సుబ్బయ్యనాయుడు బాధ్యతలు చేపట్టి నేటికీ కొనసాగుతున్నాడు. ఇతనిని చైర్మన్‌గా తొలగించినా తానే చైర్మన్ అంటూ నేటికీ కొనసాగుతుండటం



సింగరాయకొండ-ఆలయ స్థలంలో ఉన్న షాపులు



సింగరాయకొండ-ఊళ్లపాలెం లోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం

గమనార్హం. రూ.4 కోట్ల విలువైన 17.15 ఎకరాల ఆలయ భూముల రికార్డులను తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇతని ఆగడాలను అరికట్టి దేవుని ఆస్తులకు భద్రత కల్పించాల్సిన దేవదాయశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.

ఘన చరిత్ర కలిగిన కోదండరామస్వామి దేవస్థానం

ఈ దేవస్థానాన్ని సుమారు 300 ఏళ్ల క్రితం నిర్మించారు. గతంలో స్వామి వారికి ధూపదీప నైవేద్యాలు బాగా జరిగేవి. ప్రతి సంవత్సరం స్వామి వారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారు. కనిగిరి, ఒంగోలు, కొత్తపట్నం, కందుకూరు, ఉలవపాడు, కొండపి, జరుగుమల్లి మండలాల నుంచి భారీగా తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకునేవారు. కానీ ప్రస్తుతం చైర్మన్ నిర్వాకం వల్ల స్వామి వారికి దీపం తప్ప నైవేద్యం పెట్టే పరిస్థితి లేదు. ఏటా నామమాత్రంగా బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా ఉభయదాతలే ఆరోజు ఉత్సవాల ఖర్చు భరిస్తూ నిర్వహిస్తున్నారు.

ఆలయానికి కోట్లాది విలువైన ఆస్తులు

ఈ ఆలయానికి 38.71 ఎకరాల భూములు, ఉప్పు కొఠారులు, షాపులు ఉన్నాయి. కొత్తపట్నం మండలం అల్లూరు పంచాయతీ చింతల వద్ద సర్వే నంబరు 152 లో 17.15 ఎకరాలు, బింగినపల్లిలో 53 సర్వే నంబరులో 3.36 ఎకరాలు, పాకల రెవెన్యూలో సర్వే నంబరు 564-1 లో 2.12 ఎకరాలు, 565-1 లో 1.18 ఎకరాలు, 607-2 లో 3.90 ఎకరాలు, 607-1 లో 0.90 ఎకరాలు, 543 సర్వే నంబరు లో 3.80 ఎకరాలు, పెళ్లూరు పంచాయతీలో సర్వేనంబరు 169-1సి లో 1.20 ఎకరాలు, 169-1ఏ లో 2.59 ఎకరాలు, 134-4ఏ లో 1.38 ఎకరాలు, 135-4సి లో 1.35 ఎకరాలు, బింగినపల్లిలోని 2వ నంబరు నట్టులో 0.70 సెంట్ల ఉప్పు కొఠారులు, చెన్నై టీ నగర్ లో అర ఎకరా వైశాల్యంలో భవనం ఉన్నాయి. ఒక్క చెన్నై టీ నగర్ ఆస్తి విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

ఆలయ ఆస్తులు గల్లంతు

ప్రస్తుతం ఆలయ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న అచ్చికాల వెంకట సుబ్బయ్యనాయుడు అల్లూరు రెవెన్యూ పరిధిలో చింతల వద్ద ఉన్న సుమారు రూ.4 కోట్ల విలువైన సర్వే నంబరు 152 లోని 17.15 ఎకరాలకు సంబంధించి 2010 వ సంవత్సరంలో అప్పటి వీఆర్‌ఓను లోబరుచుకుని రికార్డులు తారుమారు చేసి తన బంధువుల పేరు మీద మార్పించుకుని తరువాత అమ్మకాలు జరిగినట్లు రిజిస్ట్రేషన్లు చేసి తరువాత ఆ భూమిని అల్లూరు ప్రాంత వాసులకు అమ్మేశాడు. కానీ 2016వ సంవత్సరంలో అప్పటి తహశీల్దార్ రికార్డులను పరిశీలించి ఆ భూమి కోదండరామస్వామి దేవస్థానానికి చెందిందని, కానీ రికార్డులు తారుమారు చేశారని అప్పటి కలెక్టర్ సుజాతశర్మకు నివేదిక అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టరు సుజాతశర్మ అప్పటి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఆ భూమిని స్వాధీనం చేసుకోమని ఆదేశించడంతో ఈఓ అప్పారావును నియమించారు. అయితే ఆయన 15 రోజులు విధులు నిర్వహించి రిటైరయ్యారు. చైర్మన్ వెంకట సుబ్బయ్య తాను వంశపారంపర్య ధర్మకర్త అని, అంతేకాని ఎన్నుకున్న చైర్మన్‌ను కాదని ఎటువంటి కమిటీ లేదని కోర్టును ఆశ్రయించాడు. కానీ గత సంవత్సరం నవంబరు 30వ తేదీన చైర్మన్‌ను తొలగించి ఈఓను నియమించాలని దేవదాయశాఖను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో అసిస్టెంట్ కమిషనర్ గ్రంథి మాధవి ఆలయ రికార్డులకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణను విచారణకు నియమించారు. కానీ నేటికీ విచారణ నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు ఆలయానికి ఈఓను నియమించలేదు.

దేవుని ఆదాయం స్వాహా

దేవస్థానానికి సంబంధించి అల్లూరు భూములు కాకుండా మిగిలిన భూములు, ఉప్పు కొఠారులు, దుకాణాల పై సుమారు ఏటా రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుందని బ్రహ్మోత్సవాల సమయంలో సుమారు రూ.1 లక్ష మాత్రమే ఖర్చు చేసి మిగతా రూ.3 లక్షలు స్వాహా చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆలయంలో పూజారి స్వయంపాకుల వెంకట సుధాకర్‌కు నెలకు రూ.2 వేల వేతనాన్ని గ్రామానికి చెందిన కోసూరి అనిల్, సాయిలు ఇస్తున్నారు.

రికార్డులు తారుమారు చేసి రూ.కోట్లు కొల్లగొట్టారు



కోదండరామస్వామి దేవస్థానం తిరునాళ్ల అంటే ఆ కాలంలో గొప్పగా చెప్పుకునేవారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు అంతేకాక ఉత్సవాలు వైభవంగా జరిగేవి. అచ్చికాల వెంకట సుబ్బయ్యనాయుడు చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆలయ భూముల రికార్డులు తారుమారు చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేశారు. ఉత్సవాలు కూడా నామమాత్రంగా సాగుతున్నాయి.

– పీవీరెడ్డి, మాజీ సర్పంచ్, ఊళ్లపాలెం

ఆలయ ఆదాయం దిగమింగాడు



కోదండరామస్వామి దేవస్థానం జీర్ణావస్థకు చేరింది. ఆస్తులు ఉన్నా చైర్మన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆలయాన్ని పట్టించుకోవటం లేదు. భూములపై వచ్చే ఆదాయాన్ని స్వాహా చేస్తున్నాడు. గతంలో ఎమ్మెల్యే స్వామిని చైర్మన్ నుంచి ఆలయాన్ని కాపాడాలని కోరాం. కానీ ఆయన పట్టించుకోలేదు.

– కావూరి ప్రభాకరరెడ్డి, గ్రామస్తుడు, ఊళ్లపాలెం

ఆలయాన్ని తెరవడం లేదు



ఈ ఆలయం గతంలో వైభవంగా ఉంది. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలప్పుడు తప్ప గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకునే పరిస్థితి లేదు. చాలీచాలని జీతంతో అర్చకులు స్వామివారికి నైవేద్యం పెడుతున్నాడే తప్ప ఆలయాన్ని తెరిచి ఉంచటం లేదు. చైర్మన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు.

– నాటారు వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు, ఊళ్లపాలెం

బ్రహ్మోత్సవాలప్పుడే భక్తులకు దర్శనం



నాకు నెలకు రూ.2 వేలు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇస్తున్నారు. ప్రతి రోజు స్వామి వారికి నైవేద్యం పెడుతున్నా. బ్రహ్మోత్సవాలప్పుడు మాత్రమే భక్తుల దర్శనార్థం ఆలయం తెరుస్తా.

– స్వయంపాకుల వెంకట సుధాకర్, అర్చకుడు, ఊళ్లపాలెం

అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు: అంతర్ రాష్ట్ర గంజాయి నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం జాజపూర్ జిల్లా శిశిరణ గ్రామానికి చెందిన సుబ్రహంసు జెన, ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా జగన్నాథపురం గ్రామానికి చెందిన రాతికాంత బారికను చీమకుర్తి పరిధిలోని మర్రిచెట్లపాలెం వద్ద అరెస్టు చేసి, వారి నుంచి రూ.40 వేల విలువైన 4 కేజీల గంజాయి సీజ్ చేశామని వివరించారు. నిందితులు ఇద్దరు చీమకుర్తిలోని గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో వేగంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి జిల్లాలోని చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు అరెస్టు చేశామని చెప్పారు. డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, సీఐ వి.శ్రీనివాసరెడ్డి, ఎస్సై జి.రామిరెడ్డిని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు అందించారు.

ఎస్పీ స్పందనకు 97 ఫిర్యాదులు

ఒంగోలు: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 97 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలంటూ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

- గుంటూరు జిల్లా తాడికొండ మండలానికి చెందిన బెజ్జం సాయిప్రసాద్ అనే వ్యక్తి బీబీఆర్ సంస్థను నడుపుతున్నారని, ఆ సంస్థలో మొదట రూ.40 వేలు చెల్లిస్తే నెలకు సరిపడా సరుకులు ఇచ్చి ఆరు నెలల తరువాత రెట్టింపు ఇస్తామని చెప్పి తనతోపాటు మరికొంతమందితో డబ్బు కట్టించుకుని మోసం చేశారని ఒంగోలుకు చెందిన ఎస్.ఏ లియా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- కలెక్టర్ కార్యాలయంలో బ్యాక్ లాగ్ పోస్టు ఇప్పిస్తామని చెప్పి తన వద్ద రూ.2 లక్షలు తీసుకుని ఓ వ్యక్తి మోసం చేశాడంటూ సుధారాణి అనే మహిళ ఫిర్యాదు చేసింది. స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీధరరావు, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ మరియదాసు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు రీఓపెన్ కాకూడదు

- అధికారులను ఆదేశించిన డీఆర్‌ఓ శ్రీలత



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ప్రజలు అందించే అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పనిచేసినపుడే అది సాధ్యమవుతుందని డీఆర్‌ఓ శ్రీలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. స్పందనతోపాటు జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఒకవేళ పరిష్కరించలేని సమస్యలు ఉంటే అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన బైళ్ల దేవదాసు స్పందనలో అధికారులను కలిసి తనకు ఫ్లైయాష్ బ్రిక్స్ యూనిట్ ఉందని, కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. బిల్లు సక్రమంగా చెల్లించినా ఈ నెల 11వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఫిర్యాదు చేశారు. ఏఈ నుంచి ఎస్ఈ వరకు తిరిగినా విద్యుత్ సరఫరా ఇవ్వలేదని, పైగా ట్రాన్స్‌ఫార్మర్స్ సైతం తీసుకెళ్లారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- పొదిలి మండలం సూదనగుంట గ్రామానికి చెందిన చెన్ను వెంకటేశ్వరరెడ్డి తనకు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఓఆర్, ఆర్‌ఎస్ఆర్ నకళ్లు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నంబర్ 100, 114, 115, 120కు సంబంధించి ఆర్‌ఎస్ఆర్, ఐబీ, ఆర్‌ఓఆర్ కావాలని ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్

- సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని అందించడంలో రాజకీయాలకు తావులేని పాలన
- కరోనా సమయంలో సేవలందించిన వలంటీర్లపై దారుణమైన నిందలు సరికాదు
- పవన్ కళ్యాణ్ తక్షణమే ఆరోపించిన 18 వేలమంది మహిళల పేర్లను బహిర్గతం చేయాలి
- విలేకరుల సమావేశంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాత అని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు మరో రెండు బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాంలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పేదరికంలో జన్మించిన తనకు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా, ఎస్సీ వెల్ఫేర్ సభా కమిటీ సభ్యునిగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. అమరావతిలోని ఆర్5 జోన్‌లో పేదలకు ఇళ్లపట్టాలతోపాటు ఇళ్లు కూడా నిర్మించి ఇచ్చేందుకు క్యాబినెట్ తీర్మానించిందన్నారు. పేదల పట్ల సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. సింగపూర్‌ను తలదన్నే రాజధానిని నిర్మిస్తానని కేంద్రం ఇచ్చిన రూ.5 వేల కోట్లు కూడా ఎందుకూ కొరగాకుండా తాత్కాలిక భవనాల పేరుతో విఫల రాజధానికే చంద్రబాబు పరిమితమయ్యారన్నారు. ఇప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాసన రాజధాని అమరావతే అని ఘంటా పథంగా ప్రకటిస్తుందని, అన్ని ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ వాణిజ్య, న్యాయ రాజధానులను ప్రకటిస్తే ఆయా ప్రాంతాల అభివృద్ధిని కాంక్షించలేని చంద్రబాబు అండ్‌కో దానిపై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. అమరావతిలో భూకుంభకోణం జరిగిందని ధర్నాలు చేసి, అక్కడ పెరుగన్నం కూడా తిని భూములు తిరిగి రైతులకు ఇచ్చేంత వరకు పోరాడతామన్న పవన్ కళ్యాణ్ నేడు ఎందుకు చంద్రబాబుకు దాసోహమంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన ఏవో కొన్ని విషయాలు చంద్రబాబు వద్ద ఉన్నట్లుగా అనిపిస్తుందని, అందుకే చంద్రబాబు ఆడించినట్లుగా పవన్ కళ్యాణ్ ఆడుతున్నారని విమర్శించారు. కరోనా సమయంలో ప్రపంచం మొత్తం ఇళ్లకే పరిమితమై ఉంటే వలంటీర్లు నిజమైన దేశభక్తుల్లా కరోనా మహమ్మారిని తుదముట్టించేందుకు చేసిన కృషి పవన్ కళ్యాణ్ కళ్లకు కనబడకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రపంచం యావత్తు వలంటీర్ వ్యవస్థను ప్రశంసిస్తుంటే పవన్ కళ్యాణ్ మాత్రం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలపై ఇష్టం వచ్చినట్లు ఆరోపించడం దారుణం అన్నారు. 18 వేల మంది మహిళలు అపహరణకు గురయ్యారంటూ వలంటీర్ల సేవలను అవమానించేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ వారి జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను డోర్ డెలివరీ చేస్తున్న సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసేసి జన్మభూమి కమిటీలకు కట్టబెట్టాలా అంటూ నిలదీశారు.

తండ్రి వారసత్వాన్ని తీసుకుంటే అన్యాయమైపోతావ్:

జిల్లాలో పాదయాత్రకు వస్తున్న లోకేష్ యాత్రను తాము స్వాగతిస్తున్నామని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. అయితే పాదయాత్రలో ప్రజలను అమ్మ ఒడిడబ్బులు వస్తున్నాయా? లేదా? రైతు భరోసా నిధులు అందుతున్నాయా లేదా అని కూడా అడగాలన్నారు. వెన్నుపోట్లు, కుట్రలు, కుతంత్రాలే పెట్టుబడిగా జీవిస్తున్న చంద్రబాబు నాయుడ్ని కాకుండా విలువలు గల రాజకీయ నేత ఎన్‌టీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని పాదయాత్ర చేయాలని లోకేష్‌కు హితవు పలుకుతున్నామన్నారు. అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని తాము తప్పకుండా పరిశీలించుకుంటామన్నారు. 2014-19 వరకు చంద్రబాబు పాలన, ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేస్తూ ప్రకాశం జిల్లాకు అందించిన నిధులు, సంక్షేమం, అభివృద్ధిపై లోకేష్ స్పందించాలన్నారు. ప్రకాశం జిల్లాలో పేపర్‌మిల్లు పెడతామని, పోర్టు తెస్తామని, వెలిగొండ పూర్తిచేస్తామని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అన్నీ ఎంతమందికి అందించారో గణాంకాలతో సహా స్పందించాలని ఛాలెంజ్ చేస్తున్నామని సవాల్ విసిరారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్‌బాబును సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు రెండు పదవులు దక్కినందుకు ఘనంగా సత్కరించారు.